సాక్షి వనపర్తి

శుక్రవారం : 23 : ఫిబ్రవరి : 2024



న్యాక్ బృందం పర్యటన

జడ్చర్లలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో న్యాక్ బృందం పర్యటన ముగిసింది.

వివరాలు 8లో ▸



..పనుల పరిశీలన

అలంపూర్‌లో 'ప్రసాద్ స్కీం' పనులను కేంద్ర టూరిజం శాఖ అధికారులు పరిశీలించారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.6 /18.1

రోజంతా ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ వేడిమి.. ఉదయం, రాత్రి వేళల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

9న జాతీయ లోక్‌అదాలత్



వనపర్తిటౌన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వచ్చే నెల 9న జాతీయ లోక్‌అదాలత్‌ను వనపర్తి కోర్టు సముదాయంలో నిర్వహించనున్నట్లు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.శ్రీలత పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలో పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాజీమార్గం ద్వారా కోర్టులో ఉన్న చిన్న తగాదా కేసులను పరిష్కరించుకోవాలని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రిమినల్, సివిల్ కేసులను సైతం లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. రాజీ మార్గమే రాజమార్గం అని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పాలీసెట్ దరఖాస్తులకు ఏప్రిల్ 22 వరకు అవకాశం

వనపర్తి టౌన్: పాలిటెక్నిక్‌లో ప్రవేశం కోసం పాలీసెట్ 2024కు దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 22వ తేదీ వరకు అవకాశం ఉందని వనపర్తి కేడీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ నెల 15వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని చెప్పారు. పాలిటెక్నిక్ చదివేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.250, ఇతరులకు రూ.500తో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.100 అపరాధ రుసుముతో ఏప్రిల్ 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని వివరించారు.

సూర్యప్రభ వాహనంపై శ్రీనివాసుడు



మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు స్వామివార్లు గురువారం రాత్రి సూర్యప్రభ వాహనంపై ఊరేగారు. అలివేలుమంగ, పద్మావతి సమేతంగా శ్రీనివాసుడిని శోభాయమానంగా అలంకరించిన సూర్యప్రభ వాహనంపై కొలువుదీర్చి గర్భగుడి నుంచి దేవస్థానం ముందున్న మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణ మధ్య కోనేరు మైదానం వరకు తీసుకొచ్చి.. తిరిగి గర్భగుడిలో కొలువు తీర్చారు.బంగారు ఆభరణాలు, వివిధ రకాల పూల అలంకరణ మధ్య స్వామి ధగధగ మెరిసిపోతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారితో పాటు పాలక మండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

25న జిల్లా పురుషుల కబడ్డీ జట్టు ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఈనెల 25న మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా పురుషుల కబడ్డీ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శాంతికుమార్, కురుమూర్తిగౌడ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్టు నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో వచ్చేనెల 2 నుంచి 4 వరకు జరిగే రాష్ట్రస్థాయి పురుషుల కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొంటాయని పేర్కొన్నారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు ఒరిజనల్ ఆధార్‌కార్డుతో మెయిన్ స్టేడియంలో రిపోర్టు చేయాలని వారు సూచించారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులను బోధించేందుకు అధ్యాపకుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ, నెట్, సెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని, ఈనెల 27 వరకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

నీడ కరువు..



అమరచింతలో నీడకు నోచుకోని నర్సరీ మొక్కలు

- ఎండలు తట్టుకోలేక వాడుముఖం పడుతున్న మొక్కలు
- నర్సరీల్లో ఏర్పాటు చేయని గ్రీన్‌నెట్లు
- జిల్లాలోని జీపీల్లో కొనసాగుతున్న నర్సరీలు
- ప్రస్తుత పరిస్థితుల్లో నీటిని అందించలేని వైనం

జిల్లాలో 14 మండలాలు	ప్రతి జీపీకి
255 జీపీలు	10,000 మొక్కలు

అమరచింత: ప్రతి ఏడాది హరితహారంలో భాగంగా గ్రామాల్లో వానకాలంలో మొక్కలు నాటి సంరక్షించే కార్యక్రమాలను నిర్వహించే అధికారులు.. ప్రస్తుతం నర్సరీల్లోని మొక్కలకు రక్షణ ఇవ్వలేకపోతున్న పరిస్థితులు దాపురించాయి. జిల్లాలోని 14 మండలాల్లో 255 జీపీల్లో గ్రామానికి పది వేల మొక్కల సామర్థ్యం ఉన్న నర్సరీని ఆయా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఈజీఎస్ అధికారుల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. చలికాలంలో నర్సరీలను ఏర్పాటు చేసి వాటిలో విత్తనాలు చల్లి మొక్కలు పెంచుతూ వచ్చారు. ప్రస్తుతం వేసవి కాలం ప్రారంభంలోనే ఎండలు ముదురుతుండటంతో వాటిని తట్టుకోలేక వాడుముఖం పడుతున్నాయి. దీంతో మంచి లక్ష్యంతో ఏర్పాటు చేసిన నర్సరీలు కేవలం గ్రీన్‌నెట్లు లేని కారణంగా అవి వాడుముఖం పడుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. నర్సరీ సంరక్షణ బాధ్యతలను గ్రామపంచాయతీలకు అప్పగించిన సదరు అధికారులు వీటిని విస్మరిస్తున్నారే విమర్శలు వినిపిస్తున్నాయి. వీటితో పాటు నర్సరీలోని మొక్కలకు నిత్యం నీటిని అందించలేని పరిస్థితులు సైతం దాపురించడంతో మొక్కలకు నీటి కష్టాలు దాపురించాయి.

పంచాయతీల గ్రీన్ బడ్జెట్‌లో..

గ్రామపంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీ మొక్కల నిర్వహణ కోసం ఈజీఎస్ అధికారులతో పాటు గ్రామపంచాయతీ నిధుల్లో గ్రీన్ బడ్జెట్‌ను వినియోగించాల్సి ఉంది. కాని నర్సరీల్లో మొక్కలకు వాచర్‌లతో నీటిని అందించడం వంటి కార్యక్రమాలను నిర్వహించే వారు. వీటికి తోడు గ్రామ పంచాయతీకి కేటాయించిన వాటర్ ట్యాంకర్ ద్వారా ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం మొక్కలకు నీటిని అందించాలి. కాని ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం వారానికి మూడు రోజులు మాత్రమే మొక్కలకు నీటిని అందించి చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం పంచాయతీల్లో సర్పంచ్‌ల పాలన ముగియడంలో ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు గ్రీన్‌నెట్లు ఏర్పాటుపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

జిల్లా వ్యాప్తంగా 25 లక్షల మొక్కలపెంపకం..

హరితహారంలో భాగంగా ప్రస్తుతం జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలు, మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లో నర్సరీలను ఏర్పాటు చేసి వాటి సంరక్షణ కోసం చర్యలు తీసుకున్నారు. మున్సిపాలిటీలో లక్ష మొక్కల సామర్థ్యంతో నర్సరీని ఏర్పాటు చేయగా.. గ్రామాల్లో మాత్రం పదివేల సామర్థ్యం ఉన్న మొక్కలతో నర్సరీలను కొనసాగిస్తున్నారు. దీంతో ఈసారి జిల్లా వ్యాప్తంగా నర్సరీల్లో 25.55 లక్షల మొక్కలను పెంచేందుకు ప్రణాళిక సిద్ధం చేసి వాటి కోసం నర్సరీల్లోని మొక్కలను పెంచేందుకు కృషి చేస్తున్నారు.

రహదారుల వెంట మొక్కలు సైతం...

గతంలో హరితహారంలో ఆయా గ్రామాల్లోని ప్రధాన రహదారులకు ఇరువైపుల నాటిన మొక్కలతో పాటు ప్రార్థన మందిరాలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో నాటిన మొక్కలకు సరైన సమయంలో నీటిని అందించకపోవడంతో అవి వాడుముఖం పడుతున్నాయి. వాటిని తొలగించి వాటిస్థానంలో కొత్త మొక్కలు నాటే ప్రయత్నం చేపట్టలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామ పంచాయతీలకు వాటర్ ట్యాంకర్లు ఉన్నా.. మొక్కలకు నీటిని అందించేందుకు చర్యలు చేపట్టలేకపోతున్నారని, కేవలం ప్రతి శుక్రవారం నిర్వహించే 'చెట్టు చెట్టుకు నీరు' కార్యక్రమం రోజుమాత్రం మొక్కలకు నీటిని అందిస్తున్నారు.

రహదారుల వెంట మొక్కలు కాపాడాలి..



గతంలో ప్రధాన రహదారులకు ఇరువైపులా నాటిన హరితహారం మొక్కలకు నీటిని అందించకపోవడం వాటికి ట్రీగార్డ్‌లను అమర్చకపోవడంతో మొక్కలు వాడుముఖం పడుతున్నాయి. వాటికి నీటిని అందించి, సంరక్షించే కార్యక్రమాలు చేపట్టాలి.

– విష్ణువర్ధన్ యాదవ్, అమరచింత

ఏపీఓలతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం..

గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలకు గ్రీన్‌నెట్లు ఏర్పాటు వ్యవహారంలో ఆయా మండలాల ఏపీఓలతో చర్చించి పరిస్థితులను సమీక్షిస్తాం. డీఆర్‌డీఓగా నూతనంగా బాధ్యతలు స్వీకరించా. అన్ని మండలాల్లో పర్యటించి నర్సరీలకు గ్రీన్ నెట్లు ఉండేలా చర్యలు తీసుకుంటాం.

– ఉమాదేవి, డీఆర్‌డీఓ

'పరీక్షలంటేే భయంవద్దు'



ప్రేరణ తరగతుల కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి: విద్యార్థులు పరీక్షలంటే భయపడొద్దని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ చెప్పారు. గురువారం స్థానిక ఎం.బీ గార్డెన్స్‌లో ఆయా సంక్షేమ హాస్టల్స్‌లో ఉంటూ పదో తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం నిర్వహించిన ప్రేరణ, పునఃశ్చరణ తరగతుల కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు మానసికంగా ఒత్తిడిని తగ్గించుకుని, వార్షిక పరీక్షలు రాయాలన్నారు. దీంతో ఉత్తమ మార్కులు సాధించవచ్చన్నారు. విద్యార్థులందరూ పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. అందుకు తగిన సూచనలు సలహాలు ఉపాధ్యాయులు విద్యార్థులకు అందించాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి సుబ్బారెడ్డి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారిణి నుషిత, డీటీడీఓ శ్రీనివాసులు, ఇంపాక్ట్ రవీంద్ర ధీర, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, నాగరాజు, గోవర్ధన్, మధుసూదన్, శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జోగుళాంబ సన్నిధిలో పుష్పగిరి పీఠాధిపతి



జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను గురువారం పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకరమహాభారతి స్వామివారు తన శిష్య బృందంతో కలిసి దర్శించుకున్నారు. గురుపుష్య యోగం ఏర్పడటంతో ఆకస్మికంగా జోగుళాంబ అమ్మవారిని దర్శించుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ చిన్నకృష్ణయ్య, ఆలయ అర్చక బృందంతో కలిసి ఆలయ మర్యాదలతో వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. జోగుళాంబ అమ్మవారికి పుష్పగిరి పీఠాధిపతి సువర్ణ హస్తాల మీదుగా దశవిధ హారతులు సమర్పించారు. అనంతరం భక్తులకు అనుగ్రహబాషణ చేస్తూ.. హిందూ సనాతన ధర్మం వైశిష్ట్యాన్ని, జోగుళాంబ అమ్మవారి రూప లావణ్యాన్ని వివరించారు. అదేవిధంగా జోగుళాంబ గద్వాల జిల్లా అడిషనల్ కలెక్టర్ మూసాని వెంకటేశ్వర్లు జోగుళాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆనంద్‌శర్మ, పాలక మండలి సభ్యులు వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటనారాయణరెడ్డి పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ సురేష్

వనపర్తిటౌన్: జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీస్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించినట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీస్ అధికారి మహమ్మద్ జాన్ పాషా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ జాబ్ మేళాకు 'సాక్షి' న్యూస్ పేపర్, కేఎల్ గ్రూప్ అమెజాన్, కేఎల్ గ్రూప్ విగార్డ్ ప్రీమియర్ సోలార్ కంపెనీ, ధరణి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, స్నాడర్ ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చర్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. 10వ, తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమా చదివిన వారికి మంచి వేతనాలతో 700 ఖాళీలు ఉన్నాయని, జాబ్ మేళాతో మంచి ఉద్యోగాన్ని సాధించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ మాట్లాడాతూ.. జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీస్ సహకారంతో కళాశాలలో రెండోసారి జాబ్ మేళా నిర్వహించడం సంతోషకరమన్నారు. ఉద్యోగ స్థాయిని బట్టి రూ.10 వేలు నుంచి రూ.25 వేల వరకు కంపెనీలు వేతనాలు ఇస్తున్నాయని, వాటిని యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్ మేళాకు 80 మంది నిరుద్యోగులు హాజరయ్యారని, అందులో 'సాక్షి' న్యూస్ పేపర్‌కు ఆరుగురు, ఎనిమిది మంది ధరణి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ కంపెనీ, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీకి ఇద్దరు ఎంపికయ్యారని, మొత్తం 16 మంది జాబ్స్‌కు సెలెక్ట్ అయినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎస్ కేసీ కో–ఆర్డినేటర్ రూప, లక్ష్మీ, నాగేంద్రా చారి తదితరులు పాల్గొన్నారు.

రామన్‌పాడులో 1,017 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం తగ్గుతుంది. గురువారం 1,017 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నారు.

గృహజ్యోతిపై ఇంటింటి సర్వే



బీసీ కాలనీలో విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాన్స్‌కో ఎస్‌ఈ

అమరచింత: జిల్లా వ్యాప్తంగా ట్రాన్స్‌కో సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గృహజ్యోతి పథకం వర్తింపు కోసం వినియోగదారుల నుంచి పూర్తి స్థాయిలో సమాచారం సేకరించి వివరాలను నమోదు చేస్తున్నామని ట్రాన్స్‌కో ఎస్ఈ నాగేంద్ర కుమార్ తెలిపారు. పట్టణంలో గురువారం ట్రాన్స్‌కో మొండిబకాయిల వసూళ్లపై ప్రత్యేక బృందాలతో ఇళ్లకు వెళ్లి బకాయిలు చెల్లించని వారి ఇంటి సర్వీస్‌లను తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఎస్ఈ మాట్లాడారు. జిల్లా మొత్తంలో గృహవిద్యుత్ వినియోగదారులు 1.25లక్షల మంది ఉన్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా గృహ విద్యుత్ మొండి బకాయిలు రూ.5.50కోట్లు ఉన్నాయని వీటితో పాటు వ్యవసాయ రంగం ద్వారా రూ.6.50 కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. వీటిని పూర్తి స్థాయిలో వసూళ్ల కోసం నిరంతరం ప్రత్యేక బృందాలుగా ఏర్పడి బకాయిలను వసూళ్లపై దృష్టి సారిస్తున్నామన్నారు. అదే విధంగా గృహజ్యోతి పథకం అమలు కోసం గృహ వినియోగదారులు ఇప్పటి వరకు ఎలాంటి బకాయిలు లేకుండా తమ విద్యుత్ బిల్లులను చెల్లించాలని వినియోగదారులకు అవగాహన కల్పిస్తూ.. వారు దరఖాస్తు చేసుకున్న వాటిలో ఎమైన తప్పులు ఉన్నాయా లేవా అనే విషయాలను ఇంటింటికీ వెళ్లి తెలుసుకుంటూ ఆన్‌లైన్ చేస్తున్నామని వెల్లడించారు. ఇప్పటి వరకు 80 వేల మంది విద్యుత్ వినియోగదారులను గుర్తించి వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. ఇంకా మిగిలిన వారికోసం తమ సిబ్బంది నిరంతరం గ్రామాల్లోకి వెళ్లి తగు వివరాలను సేకరిస్తున్నారని చెప్పారు. రేషన్‌కార్డులో పేరు ఉంటే చాలని విద్యుత్ మీటర్ తమ పేరుపై లేదని యజమాని భయపడాల్సిన అవసరం లేదన్నారు. విద్యుత్ వినియోగదారులు మొండి బకాలయిలు చెల్లించి తమ ట్రాన్స్‌కో సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీఈ నరేందర్, ఏఈ రాంచందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

మహర్దశ పట్టేనా..?

అంపశయ్యపై మన్ననూర్ ఐటీడీఏ



మన్ననూర్ ఐటీడీఏ కార్యాలయం

- తొమ్మిదేళ్లుగా రెగ్యులర్ పోస్టుల మంజూరులో కాలయాపన
- ఇన్‌చార్జ్ పీఓలతో నెట్టుకొస్తున్న వైనం
- చెంచుల ఆర్థికాభివృద్ధి పథకాలకు ఆటంకం

అచ్చంపేట: గత ప్రభుత్వాల పట్టింపులేని ధోరణి.. ప్రజాప్రతినిధుల అలసత్వం.. అధికారుల నిర్లక్ష్యం.. వెరసి సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) అంపశయ్యపై కొట్టుమిట్టాడుతోంది. అయితే ఈ నెల 18న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క భద్రాచలం ఐటీడీఏను సందర్శించి పాలక మండలి సమావేశం జరగకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. నిర్లక్ష్యానికి గురైన ఐటీడీఏలను చక్కదిద్ది పూర్వవైభవం తెస్తామని చెప్పడంతో చెంచుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో శ్రీశైలం (సున్నిపెంట) ఐటీడీఏలో ఉండగా.. తెలంగాణ ఏర్పడ్డాక మన్ననూర్‌లో ఐటీడీఏ ఏర్పాటైంది. ఐటీడీఏ ఏర్పాటై తొమ్మిదేళ్లవుతున్నా ప్రభుత్వం ఇప్పటి వరకు రెగ్యులర్ ప్రాజెక్టు అధికారి, ప్రధాన పోస్టులు మంజూరు చేయలేదు. దీంతో కీలక పోస్టులన్నీ ఖాళీగా ఉండటంతో ఐటీడీఏ మనుగడకే ముప్పు ఏర్పడింది. దీంతో నల్లమల చెంచులు, ఆదివాసీల జీవనోపాధి, ఆర్థికాభివృద్ధికి నోచుకోవడం లేదు. కార్యాలయం మొత్తంలో ఒక సీనియర్ అసిస్టెంట్ విధులు నిర్వహిస్తుండడం గమనార్హం.

పడకేసిన సంక్షేమ పథకాలు..

చెంచుల సంక్షేమ, ఆర్థికాభివృద్ధి పథకాలను ఐటీడీఏ పర్యవేక్షిస్తోంది. గిరిజనులకు సంబంధించి విద్య, వైద్యం, ఇతర మౌలిక సదుపాయాల కల్పన, నీటి పారుదల, వ్యవసాయం, రాయితీపై వ్యవసాయ పరికరాలు, ట్రికార్ రుణాలు, మత్స్యశాఖ పరిధిలో చేపపిల్లల పెంపకం వంటివి సరిగా అమలు కావడం లేదు. వీటికి ఏటా నిధులు కేటాయించడం లేదని చెంచులు వాపోతున్నారు. అలాగే చెంచు మహిళలు, చిన్నారులకు పోషకాహారం అందించేందుకు గిరి పోషణ పథకం కింద రూ.కోటి నిధులు మంజూరైనా రూ.20 లక్షలకు మించి ఖర్చు చేయడం లేదని తెలుస్తోంది. గిరి వికాసం కింద గిరిజనులు వ్యవసాయం చేసుకునేందుకు ఉచితంగా బోర్లు వేసి మోటార్లు ఇవ్వాల్సి ఉండగా చాలా మందికి ఈ పథకం అందడం లేదు. పశుసంవర్ధకశాఖ ద్వారా గొర్రెలు, మేకలు, పశువులు సబ్సిడీపై అందించేది. ఆ శాఖ అధికారులు లేకపోవడంతో పూర్తిగా మరుగున పడింది. ఐటీడీఏ ప్రస్తుతం నిర్వహణ పనులకే పరిమితమైందన్న విమర్శలున్నాయి. రెగ్యులర్ పీఓతోపాటు మిగతా పోస్టులు భర్తీ చేస్తేనే చెంచులకు ప్రాజెక్టు సేవలు అందుతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఒకే ఒక్కడు..

మన్ననూర్‌లో ఐడీడీఏ ప్రాజెక్టు కార్యాలయాన్ని ప్రభుత్వం 2015 మార్చి 20న ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి ఇప్పటివరకు రెగ్యులర్ ప్రాజెక్టు ఆఫీసర్‌ను నియమించకుండా ఇన్‌చార్జ్‌లతోనే నెట్టుకొస్తోంది. ప్రాజెక్టు విభజన సమయంలో 57:43 నిష్పత్తిలో ఉద్యోగులను నియమిస్తే అన్ని విభాగాల్లో కలిపి 20 పోస్టులు ఉండాలి. సున్నిపెంట నుంచి విలీనమైన తర్వాత రికార్డులతో పాటు ఇక్కడి వచ్చిన సీనియర్ అసిస్టెంట్ జాఫర్ అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. ప్రాజెక్టులో ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ విభాగం, డీఎస్‌ఓ, మేనేజర్, సీఎస్‌ఓ, హెచ్‌ఓలు, మత్స్య శాఖ, అగ్రికల్చర్, హార్టికల్చర్, పశువైద్యాధికారితో పాటు ఇద్దరు పర్యవేక్షకులు, ముగ్గురు సీనియర్, ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు, వ్యవసాయాధికారి, ఏఈఈ, కార్యాలయ సిబ్బంది పోస్టులు భర్తీ చేయాల్సి ఉన్నా చేయడం లేదు.

ఇన్‌చార్జ్ బాధ్యతల అప్పగింత

ప్రాజెక్టు ఏర్పాటైన ప్పటి నుంచి ఇన్‌చార్జ్‌ల పాలన కొనసాగుతోంది. డాక్టర్ వెంకటయ్య, డీటీడీఓగా పనిచేసిన మంగ్యానాయక్, అశోక్, డాక్టర్ నవీన్ నికోలస్, డిప్యూటీ కలెక్టర్ మనుచౌదరి, రెండేళ్లుగా కలెక్టర్ ఉదయ్‌కుమార్ ప్రాజెక్టు ఇన్‌చార్జ్ పీఓగా వ్యవహరించారు. నిత్యం జిల్లా పరిపాలనలో నిమగ్నం కావడంతో ఐటీడీఏ ప్రాజెక్టు రోజువారి కార్యకలాపాలపై దృష్టిసారించలేకపోతున్నారన్న అభిప్రాయంతో ఇటీవల డీఎఫ్‌ఓ రోహిత్‌రెడ్డికి ఐటీడీఏ పీఓ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఇన్‌చార్జ్‌లుగా ఉన్న అధికారులు చెంచుల అభివృద్ధి కోసం నేరుగా పనిచేయలేకపోతున్నారు. ప్రతి పనికి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖకు ఫైల్స్ పంపించాల్సి వస్తోంది.

అంతర్భాగమైన కార్యాలయాలు

మన్ననూర్ ఐటీడీఏ పరిధిలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌తోపాటు 11 ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు, 46 ఆరోగ్య ఉపకేంద్రాలు, 56 ప్రాథమిక పాఠశాలలు, 16 ఆశ్రమ పాఠశాలలు, చెంచులకు ఉపాధి కల్పించేందుకు జాతీయ ఉపాధి హామీ పథకం, వ్యవసాయ, గిరిజన సహకార సంస్థతోపాటు ఐకేపీ, టీపీఎంయూ ఐటీడీఏలో అంతర్భాగంగా ఉన్నాయి. నేటికి వందలాది మంది చెంచులకు వ్యవసాయ భూమి లేదు. అటవీ ప్రాంతంలో ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూమిపై హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నా అతీగతీ లేదు. అటవీ ఉత్పత్తుల సేకరణతోపాటు వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్న చెంచులకు భూ పంపిణీ జరగడం లేదు.

మన్ననూర్ ఐటీడీఏ స్వరూపం..

జిల్లాలు: 5 (నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నల్లగొండ, వికారాబాద్, రంగారెడ్డి)

మండలాలు 25	గ్రామాలు 173
చెంచు కుటుంబాలు 4,041	గిరిజన జనాభా 14,436
మొత్తం పోస్టులు 20	ప్రస్తుత ఖాళీలు 19



నల్లమల లోతట్టు చెంచుపెంటల్లోని చెంచుల ఆవాసాలు

నిర్లక్ష్యం చేసింది..



మన్ననూర్ ఐటీడీఏలో పోస్టుల భర్తీలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. తొమ్మిదేళ్లుగా ఒకే ఒకరితో నెట్టుకొస్తున్నారు. దీనిపై గతంలోనే గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. అధికారులు లేకపోవడంతో సకాలంలో పనులు జరగడం లేదు. బడ్జెట్ కేటాయింపులు అంతంత మాత్రంగా ఉన్నాయి.

– నిమ్మల శ్రీనివాసులు, ఆదివాసీ చెంచు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు

జనాభా వివరాలు ఇలా..

జిల్లా	మం.	పం.	గ్రామాలు	కుటుంబాలు	జనాభా
నాగర్‌కర్నూల్	8	49	112	2,630	9,514
మహబూబ్‌నగర్	2	9	10	279	942
రంగారెడ్డి	2	8	10	163	568
వికారాబాద్	9	24	26	678	2,343
నల్లగొండ	4	11	15	291	1,069
మొత్తం	25	101	173	4,041	14,436

మం.: మండలాలు పం.: పంచాయతీలు



క్లుప్తంగా

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

మహబూబ్‌నగర్ క్రైం: గుర్తు తెలియని రైలు కిందపడి, గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే ఎస్‌ఐ అక్బర్ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి గేట్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి(50) గురువారం తెల్లవారుజామున గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి దగ్గర ఎలాంటి ఆధారాలు లభించలేదని, కేవలం షర్ట్‌పై ఉన్న ప్రతిభ టైలర్స్ పేరుతో ఉన్న ఆధారంతో క్లాక్‌టవర్‌లో ఉన్న టైలర్ దుకాణంలో విచారించిన వివరాలు లభించలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరేసుకుని యువకుడు..

రాజాపూర్: కడుపునొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం మండలంలోని ముదిరెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే గ్రామానికి చెందిన ఉందేకోటి చందు (24) కొన్ని రోజుల క్రితం సెజ్‌లోని ఓ పరిశ్రమలో పని చేస్తున్నాడు. నైట్ డ్యూటీ ఉందని మధ్యాహ్నం తల్లిదండ్రులకు చెప్పి ఇంటి మిద్దెపై పడుకుంటానని చెప్పి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. సాయంత్రం వరకు తమ కుమారుడు ఇంకా కిందికి రాలేదని మిద్దె పైకి వెళ్లి చూడగా ఉరేసుకున్నాడు. కడుపునొప్పితో తన కుమారుడు బాధపడేవాడని, అది భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి తండ్రి శంకరయ్య ఫిర్యాదు చేశారు.

మద్యానికి బానిసై వ్యక్తి..

రాజాపూర్: మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం మండలంలోని ముదిరెడ్డిపల్లిలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన చింతల జంగయ్య(35) మద్యానికి బానిసై భార్యా పిల్లలను వేధిస్తుండడంతో భార్య తన పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో ఇంట్లో ఉన్న చెల్లెలు, తల్లిని కూడా వేధిస్తుండడంతో తల్లి తన పెద్ద కూతురు వద్దకు వెళ్లింది. దీంతో మూడురోజుల క్రితం నుంచి ఇంటి తలుపు తీయకపోవడంతో పాటు గురువారం ఇంటి పక్కలవారికి ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో విషయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఇంటి తలుపులు తీసి చూడగ కుళ్లిన మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్‌ఐ రవి తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక వృద్ధుడు..

జడ్చర్ల: కడుపు నొప్పి భరించలేక వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గంగాపూర్ చెందిన కాటిక రాములు(66) కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. నొప్పి వచ్చినప్పుడల్లా కల్లు తాగి పడుకునేవాడు. ఈ క్రమంలో బుధవారం కడుపునొప్పితో బాధపడుతూ పొలం దగ్గరకు వెళ్లి పురుగుల మందు తాగాడు. వెంటనే చికిత్స కోసం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. గురువారం మృతుడి కుమారుడు శివ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెట్టుకు ఉరేసుకుని వివాహిత బలవన్మరణం

మిడ్జిల్: మండలంలోని బైరంపల్లికి చెందిన వివాహిత ఓసు లక్ష్మి(30) గురువారం వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మి, భర్త కృష్ణయ్యతో కలిసి గురువారం ఇంటి నుంచి పొలం వద్దకు బయలుదేరారు. భర్త పొలం వద్ద నీళ్లు పెట్టమని చెప్పి, ఊర్కొండలో రాళ్లు తీసేందుకు వెళ్లాడు. మధ్యాహ్నం పొలం వద్ద చెట్టుకు లక్ష్మి ఉరేసుకోగా, చుట్టు పక్కల వారు గమనించి భర్తకు సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి చూసే సరికి మృతి చెందడంతో పోలీసులకు విషయం చెప్పారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

కుటుంబ కలహాలతో..

నవాబుపేట: కుటుంబ కలహాలతో వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చెన్నారెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. జడ్చర్ల మండలం పెద్దపల్లికి చెందిన అనితను నవాబుపేట మండలం చెన్నరెడ్డిపల్లికి చెందిన బడుగుల సత్యంకు ఇచ్చి 15 ఏళ్ల క్రితం పెళ్లి చేశారు. భర్త సత్యంతో అనిత(35) బుధవారం గొడవ పడి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందుతాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆలస్యంగా గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి ఈదమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మృతదేహాలు తరలింపు

భూత్పూర్: మండలంలోని అన్నాసాగర్ వద్ద జరిగిన కారు ప్రమాదంలో ఏపీలోని అనంతపూర్‌కు చెందిన ఎస్‌ఐ వెంకట్‌రమణ, డ్రైవర్ చంద్ర, మచిలీపట్నంకు చెందిన పవన్ సాయి మృతి చెందిన విషయం విధితమే. గురువారం ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాలకు పంచనామ నిర్వహించి, పోస్టుమార్టం చేసిన అనంతరం వారి స్వస్థలాలకు కుటుంబసభ్యులు తీసుకెళ్లినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన అనూషను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారని, పరిస్థితి నిలకడగా ఉన్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

ప్రసాద్ స్కీం పనుల పరిశీలన

- అదనపు నిధుల విడుదల కోసం ఢిల్లీ బృందం ఆరా
- వారంలో ప్రారంభోత్సవం చేసేందుకు చర్యలు?


ఆలయ సముదాయాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం అధికారులు

జోగుళాంబ శక్తిపీఠం: కేంద్ర పర్యాటక శాఖ ద్వారా అలంపూర్‌లో రూపుదిద్దుకుంటున్న ప్రసాద్ స్కీం భవన పనులను గురువారం ఢిల్లీ కేంద్ర బృందం మినిస్ట్రీ ఆఫ్ టూరిజం(ప్రసాద్) అసిస్టెంట్ డైరెక్టర్ దిలీప్ కమార్, ప్రసాద్ స్కీం కన్సల్‌టెంట్ ప్రశాంత్, ఇండియా టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.కృపాకర్, సీఈ వెంకటరమణ, టూరిజం ఎస్ఈ సంయుద్దీన్, డీఈ ధన్‌రాజ్ పరిశీలించారు. వారు ముందుగా నదీతీరంలో యోగనారసింహ స్వామి ఆలయం పక్కన నిర్మాణ మవుతున్న మూడంతస్తుల భవనాన్ని పరిశీలించారు. ఇప్పటి వరకు ప్రసాద్ స్కీం కింద రూ.18.5 కోట్లు మంజూరు కాగా, చేసిన పనులలో మరో రూ.10 కోట్లు చెల్లింపులు కావాల్సి ఉంది. దీంతో ఇక్కడి అధికారులు మూడో విడత నిధుల కోసం లేఖ పంపడంతో పనులను పరిశీలించేందుకు ఈ బృందం అలంపూర్ చేరుకుంది. మరో వారం రోజులలో భవనాన్ని ప్రారంభోత్సవం చేసేందుకు పనులు త్వరితగతిన పూర్తి చేసే అవకాశం ఉందా అని ప్రశ్నించారు. ఎప్పుడు ఎన్నికల కోడ్ వస్తుందో తెలియని నేపథ్యంలో త్వరితగతిన పనులు పూర్తి చేసి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా వారం రోజులలో ప్రారంభోత్సవం చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టినట్లు తెలుస్తుంది. అప్రోచ్ రోడ్డుకు అడ్డంగా ఉన్న ప్రహరీ తొలగించగా, ఈ పనులను బృందం పరిశీలించింది.

పనులపై సూచనలు, సలహాలు

ఆలయంలోని పుష్కర ఘాట్ వద్ద భక్తుల కోసం దుస్తులు మార్చుకునే గదులు, ప్రహరీ, చెత్తను భద్రపరిచే చెత్త బుట్టలు, ఆహ్లాదకరమైన వాతావరణంలో యాత్రికులు కూర్చునేందుకు అవసరమైనన్ని గజీబో (అధునాతన పెండల్స్) ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆలయ ఆవరణలో 50 కుండీలు ఏర్పాటు చేసి అందమైన మొక్కలను పెంచాలని, వాహనాల పార్కింగ్ వద్ద టైల్స్, మూడంతస్తుల భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎక్స్‌టర్నల్ ల్యాండ్ స్కేపింగ్, సీసీ రోడ్డు, హై బిల్డింగ్ వద్ద 15 బెంచీలు, పుష్కర ఘాట్ వద్ద పాత మరుగుదొడ్లను తొలగించి అధునాతనమైనవి ఏర్పాటు చేయాలని సూచించారు. వీరితో పాటు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, డీఈ ధన్‌రాజ్, చైర్మన్ చిన్న కృష్ణయ్య ఉన్నారు.

పోలేపల్లిలో స్పీకర్ ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్

కోస్గి: అసెంబ్లీ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ గురువారం పోలేపల్లి ఎల్లమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం ముఖ్యమంత్రి కోస్గి పర్యటన సందర్భంగా మహిళా సంఘాల ప్రతినిధులతో చేసిన ముఖాముఖి కార్యక్రమంలో స్పీకర్ అమ్మమ్మ గారి ఊరు పోలేపల్లి అని మహిళలకు చెప్పడంతో.. గురువారం స్పీకర్ గ్రామానికి చేరుకుని ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, అధికారులు స్పీకర్‌కు పూర్ణకుంభ స్వాగతం పలికి పూజలు చేయించారు.

కశ్మీర్ టు కన్యాకుమారి సైకిల్‌యాత్ర


సైకిల్ యాత్ర చేస్తున్న విశ్వనాథన్, చైతన్య కులకర్ణి

అడ్డాకుల: ముంబాయికి చెందిన ఇద్దరు కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేపట్టిన సైకిల్ యాత్ర గురువారం మూసాపేట, అడ్డాకుల మండలాల్లోని 44వ నంబర్ జాతీయ రహదారిపై సాగింది. ప్రైవేట్ ఉద్యోగి విశ్వనాథన్, యాడ్ ఫిలీం అడ్వటైజర్ చైతన్య కులకర్ణి ఫిబ్రవరి 2న కశ్మీర్‌లోని శ్రీనగర్ నుంచి కన్యాకుమారికి సైకిళ్లపై యాత్రను మొదలు పెట్టారు. పటాన్‌కోట్, ఢిల్లీ, ఆగ్రా, గ్వాలియర్, నాగ్‌పూర్ నుంచి తెలంగాణలోకి ప్రవేశించిన సైకిల్ యాత్ర ఆదిలాబాద్, హైదరాబాద్ మీదుగా కర్నూల్ వైపు సాగుతోంది. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని, శారీరక శ్రమ వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని ప్రచారం చేయడంలో భాగంగా యాత్ర చేపట్టినట్లు వారు వెల్లడించారు. ప్రతి రోజు 130 నుంచి 150 కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. మరో 8 రోజుల్లో కన్యాకుమారి చేరుకుని అక్కడ యాత్రను ముగించనున్నట్లు పేర్కొన్నారు. ఇంతకు ముందు ముంబాయి నుంచి గోవా, గుజరాత్‌లోని సర్దార్ వల్లబాయ్ పటేల్ విగ్రహం వరకు సైకిల్ యాత్ర చేసినట్లు వివరించారు.

ముగిసిన న్యాక్‌బృందం పర్యటన


బొటానికల్ గార్డెన్‌లో మొక్క నాటుతున్న న్యాక్ బృందం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో న్యాక్ బృందం రెండు రోజుల పర్యటన గురువారంతో ముగిసింది. రెండో న్యాక్ బృందం అధ్యక్షుడు ధారానాథ్, నిర్వాహక సభ్యులు ప్రొ. జయచంద్రదారెడ్డి, సభ్యుడు బిమల్ బరాహ్ బొటానికల్ గార్డెన్‌ను సందర్శించారు. వారికి ప్రిన్సిపాల్ డా.అప్పియాచిన్నమ్మ, గార్డెన్ సమన్వయకర్త సదాశివయ్య వివిధ విభాగాల గురించి వివరించారు. ప్రత్యేకంగా అటవీ మొక్కల విభాగం, ఎర్రచందనం, శ్రీగంధం, విస్తృత బీజాల విభాగాలను చూసి వాటిని పెంచుతున్న తీరును సభ్యులు అభినందించారు. పండ్ల మొక్కల విభాగంలో అరుదైన వాటిని చూసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అటవీ విభాగాన్ని చూసి అక్కడ పెరిగిన 40అడుగుల మొక్కలపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బయోడైవర్సిటీ, రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ సెంటర్‌ను సందర్శించి అక్కడి పరిశోధనల గురించి తెలుసుకున్నారు. అక్కడ భద్రపరిచిన అతిపెద్ద జెర్రిపోతుకుబుసం పరిశీలించారు. గార్డెన్‌లో మొక్కలు నాటి నీళ్లు పోశారు. అనంతరం కళాశాలలోని వివిధ రికార్డులను సూపరింటెండెంట్ రవి ఆధ్వర్యంలో పరిశీలించారు. చివరగా ఏర్పాటు చేసిన సభలో కళాశాలలో జరిగిన అభివృద్ధిని ప్రశంసించారు. అన్ని సౌకర్యాలున్నప్పటికీ మరింత అభివృద్ధి సాధించటానికి సూచనలు చేశారు. కళాశాలకు స్వయం ప్రతిపత్తి కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐక్యూసీ కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, అకాడమిక్ కో ఆర్డినేటర్ రవీందర్‌రావు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వైకల్యాన్ని జయించి..
అథ్లెటిక్స్‌లో గోల్డ్ మెడల్


లింగప్ప

మాగనూర్: రెండు చేతులు లేకున్నా అథ్లెటిక్స్‌లో గోల్డ్ సాధించి యువతకు ఆదర్శంగా నిలిచాడు. మండలంలోని కొల్పూర్ చెందిన నాగప్ప, మహాదేవమ్మకు కుమారుడు లింగప్ప మక్తల్‌లో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. వీరిది వ్యవసాయ కుటుంబం. చిన్నప్పుడు లింగప్ప గొర్రెలను కాస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి రెండు చేతులను కోల్పోయాడు. అయినా అధైర్యపడకుండా సాధన చేస్తూ గత నెల 27న వరంగల్‌లో నిర్వహించిన 100, 400 మీటర్ల పరుగులో పారా అథ్లెటిక్స్‌లో పోటీ పడి గోల్డ్ మెడల్ సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మార్చి 11న ఢిల్లీలో నిర్వహించే జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలలో ఈయన పాల్గొననున్నాడు. ప్రస్తుతం మన్సూరాబాద్ హాస్టల్‌లో ఉంటూ సరూర్‌నగర్ స్టేడియంలో కోచ్ సాయిరెడ్డి సమక్షంలో ప్రాక్టీస్ చేస్తున్నాడు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి గురువారం తన కార్యాలయంలో యువకుడిని శాలువ, పూలమాలతో సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇలాంటి వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. వారిలో దాగి ఉన్న నైపుణ్యం వెతికి తీసి దేశానికి బంగారు పథకాలు అందించాలని తెలిపారు. లింగప్పకు అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. ఆనంద్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, పీడీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ వార్డెన్‌కు మెమో జారీ



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో ఉన్న బీసీ బాలికల హాస్టల్ వార్డెన్ విద్యార్థులకు సరైన ఆహారం పెట్టడం లేదని వచ్చిన ఆరోపణలపై బీసీ సంక్షేమశాఖ అధికారులు విచారణ చేపట్టారు. బుధవారం బీసీ సంక్షేమశాఖ అధికారి ఇందిరా హాస్టల్‌ను తనిఖీ చేశారు. వంట వండే విధానం, బియ్యం నాణ్యతను పరిశీలించి, విద్యార్థులతో చర్చించారు. ఈ అంశంపై సమగ్ర నివేదికను తయారు చేశారు. ఇదే హాస్టల్ వార్డెన్ ధర్మాపూర్‌లోని బీసీ బాలికల హాస్టల్‌కు సైతం ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. అక్కడ కూడా విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం లేదని, సమయానికి రావడం లేదని తదితర ఆరోపణలు రావడంతో అదనపు బీసీ సంక్షేమశాఖ అధికారి విఠల్ బుధవారం విచారణ చేపట్టారు. విచారణకు వెళ్లిన ఆయనకు విద్యార్థులు రాత పూర్వకంగా సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ రెండు హాస్టల్స్‌లో జరిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు హాస్టల్ వార్డెన్‌కు మెమోలు జారీ చేశారు. మెమోలకు సమాధానం ఇచ్చిన అనంతరం ఆమెపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఈ వ్యవహారంపై బీసీ సంక్షేమశాఖ అధికారి ఇందిరాను వివరణ కోరగా రెండు హాస్టల్స్‌లో విచారణ అనంతరం వార్డెన్‌కు మెమో జారీ చేసినట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు ఫైల్ పంపించనున్నట్లు పేర్కొన్నారు.

నల్లమల అభయారణ్యంలో మంటలు


మంటలు ఆర్పుతున్న ఫైర్ వాచర్లు

మన్ననూర్: అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యంలో మంటలు వ్యాపించాయి. గురువారం మన్ననూర్ ఫారెస్టు రేంజ్ పరిధిలోని భౌరాపూర్, రాంపూర్, ఫరహాబాద్ సెక్షన్లలో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అటవీశాఖకు చెందిన 15 మంది ఫైర్ వాచర్లు, 15 మంది బేస్ క్యాంపు సిబ్బంది 4 గంటల పాటు శ్రమించి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చినట్లు మన్ననూర్ రేంజ్ అధికారి ఈశ్వర్ తెలిపారు. ఈ క్రమంలో సమీపంలోని అటవీ పరిసరాలు సుమారు 8 హెక్టార్లలో దగ్ధమైందన్నారు. వేసవిలో అడవి తరుచుగా మంటలు వ్యాపిస్తుంటాయని తెలిపారు. కొన్ని సమయాల్లో తమ అవసరాల కోసం అడవికి వెళ్లే వారు చుట్ట, బీడీ కాల్చి పడేయడంతో అడవి తగులబడి పోతుందన్నారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా అటవీశాఖ అధికారుల అనుమతులు లేకుండా ఇతరులు ఎవరు కూడా అటవీలోకి ప్రవేశించరాదనే నిబంధనలు ప్రస్తుతం అమలులో ఉన్నాయని ఎఫ్ఆర్ఓ తెలిపారు.

క్రీడానైపుణ్యాన్ని చాటుకోవాలి

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి


క్రీడాకారులు, కోచ్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్ క్రీడలు: క్రీడల్లో వచ్చిన అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రంజీ జట్టులో చోటు దక్కించుకున్న జి.గణేష్, హెచ్‌సీఏ రాష్ట్ర అండర్–23 టోర్నీలో పాల్గొన్న అరుణ్‌కుమార్ సన్మాన కార్యక్రమం గురువారం జిల్లా కేంద్రం పిల్లలమర్రి సమీపంలోని ఎండీసీఏ మైదానంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే క్రీడాకారులను ఘనంగా సన్మానించి అభినందించారు. ఆయన మాట్లాడుతూ క్రీడానైపుణ్యాన్ని చాటి ఉన్నతస్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. మహబూబ్‌నగర్‌లో క్రికెట్ స్టేడియం నిర్మాణం కోసం బీసీసీఐకి ప్రతిపాదనలు పోయాయని, వీలైనంత త్వరలో నిధులు వస్తాయన్నారు. ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లా క్రీడాకారుడు రంజీజట్టుకు ఎంపికకావాలనే మా ఆకాంక్ష ఇప్పటికి నెరవేరిందన్నారు. రాబోయే రోజుల్లో గణేష్ రంజీ మ్యాచ్‌లు ఆడుతాడని, అదే విధంగా ఐపీఎల్‌కు కూడా ఎంపికకావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజేందర్‌రెడ్డి, సురేష్‌కుమార్, వెంకటరామారావు, రాజశేఖర్, కృష్ణమూర్తి, కోచ్‌లు పాల్గొన్నారు.

గణేష్‌ను అభినందించిన మాజీ ఎంపీ

రంజీజట్టులో చోటు దక్కించుకున్న గణేష్‌ను మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి తన నివాసంలో అభినందించి సన్మానం చేశారు.

ఆర్‌ఎంపీలు నిబంధనలు ఉల్లంఘించొద్దు

- కేటీదొడ్డి మండలంలో వైద్యశాఖ అధికారుల దాడులు
- పలు క్లినిక్‌లు సీజ్


మెడికల్ షాపు సీజ్ చేస్తున్న వైద్యాధికారులు

కేటీదొడ్డి: ఆర్‌ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవని జిల్లా ఉపవైద్య ఆరోగ్యశాఖ అధికారి సిద్ధప్ప హెచ్చరించారు. కలెక్టర్ సంతోష్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌ఓ శశికళ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని నందిన్నె, కుచినెర్లలో ఆర్‌ఎంపీలు నిర్వహిస్తున్న క్లినిక్‌లపై ప్రోగ్రాంఆఫీసర్ డాక్టర్ రాజుతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ కేంద్రాల్లో సొంత వైద్యం, మత్తు ఇంజక్షన్లు, మందులు వాడుతూ రోగులకు సెలైన్ బాటిల్స్ ఎక్కిస్తూ పట్టుబడ్డారు. మెడికల్ షాపులను కూడా నడుపుతున్నట్లు తేలింది. కేటీదొడ్డికి చెందిన శ్రీకాంత్, రఘు, నందిన్నెకు కంసలి కృష్ణ క్లినిక్‌లను సీజ్ చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. కొందరు ముందస్తు సమాచారం తెలుసుకుని క్లినిక్‌లు, మెడికల్ షాపులు మూసుకుని తప్పించుకున్నారని వాటిని మరోసారి దాడులు నిర్వహిస్తామని తెలిపారు.

వైద్యాధికారుల దాడులు

గట్టు: వైద్యాధికారులు గ్రామాల్లోని ఆర్‌ఎంపీలు నిర్వహిస్తున్న క్లినిక్‌లపై దాడులను నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సిద్ధప్ప, ప్రోగ్రాం అధికారి రాజు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది మొత్తం 10 మంది ప్రత్యేక బృందంగా ఏర్పడి గ్రామాల్లో దాడులను నిర్వహించారు. గొర్లఖాన్‌దొడ్డిలో ఆర్‌ఎంపీలు నిర్వహిస్తున్న క్లినిక్‌లను తనిఖీ చేపట్టారు. విషయం తెలుసుకున్న మండల కేంద్రంతోపాటుగా చుట్టు పక్కల గ్రామాల్లోని ఆర్‌ఎంపీలు క్లినిక్‌లను మూసుకుని వెళ్లారు.

భారత్‌మాల పనులను అడ్డుకున్న రైతులు


పనుల వద్ద గుమిగూడిన రైతులు

రాజోళి: భారత్ మాల స్కీం ద్వారా వేస్తున్న ఆరు లైన్ల రహదారిలో బ్రిడ్జి నిర్మాణంలో మార్పులు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. రాజోళి–వడ్డేపల్లి మధ్యలో వెళ్తున్న ఆరు లైన్ల రహదారిపై నిర్మిస్తున్న బ్రిడ్జి ఎత్తుతో ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పారు. ఈ క్రమంలో రైతులు, ప్రజా సంఘాల నాయకులు గురువారం పనులు చేస్తున్న చోటుకు వెళ్లి నిరసన తెలిపారు. బ్రిడ్జి ఎత్తు చిన్నగా ఉండటం వల్ల రైతులు పండించిన ధాన్యం తీసుకెళ్లేందుకు కూడా వీలు పడదని, పెద్ద వాహనాలు తిరిగేందుకు అవకాశం లేకుండా పోతుందని రైతులు వాపోయారు. నిత్యం వందలాది వాహనాలు తిరిగే రోడ్డుపై సరైన రీతిలో బ్రిడ్జి నిర్మించకపోతే భవిష్యత్‌లో రాకపోకలకు ఇబ్బందులు కలగడమే కాకుండా, అభివృద్ధి కుంటుపడుతుందని వివరించారు. బ్రిడ్జి ఎత్తు పెంచేదాకా పనులు చేపట్టవద్దని, పనులు జరగనివ్వమని అడ్డుకున్నారు. దీంతో కాంట్రాక్టర్లు అక్కడకు వచ్చినా రైతులు మాట వినలేదు. బ్రిడ్జి నిర్మాణంలో ఇప్పుడు మార్పు కాకపోతే మున్ముందు అసలే జరగదని, దీని వల్ల వచ్చే ఇబ్బందులకు రాజోళితో పాటు పలు గ్రామాల వారు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు. రైతులు మాట వినకపోవడంతో చేసేదేమి లేక కాంట్రాక్టర్, సిబ్బంది పనులు నిలిపేశారు. కార్యక్రమంలో రాజోళి, తూర్పుగార్లపాడు, తుమ్మలపల్లె రైతులు కేవీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎంపీపీ బోజ్యానాయక్ రాజీనామా

కొల్లాపూర్: మండల ఎంపీపీగా కొనసాగుతున్న బోజ్యానాయక్ ఆ పదవికి రాజీనామా చేశారు. గురువారం ఆయన కలెక్టర్‌కు రాజీనామా లేఖను పంపించారు. జనరల్ మహిళకు రిజర్వ్ అయిన కొల్లాపూర్ ఎంపీపీ పదవి సింగోటం ఎంపీటీసీ సభ్యురాలు చేపట్టారు. ఆమె రాజీనామా చేయడంతో వైస్ ఎంపీపీ బోజ్యానాయక్ పదవి చేపట్రాటు. 28న ఎంపీపీ ఎన్నిక చేపట్టాలని ఇటీవలనే రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో బోజ్యానాయక్ ఎంపీపీ పదవి నుంచి తప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గిరిజనుడిని అయినందున ఎంపీపీ పదవిలో కొనసాగడం ఇష్టం లేక తనపై మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అవిశ్వాసం పెట్టించారని ఆరోపించారు. ఆయనపై పరుష పదజాలంతో విమర్శలు గుప్పించారు. మాజీ ఎమ్మెల్యేకు దమ్ముంటే ఎక్కడి నుంచైనా సరే తనపై పోటీచేసి గెలవాలన్నారు. రాజకీయంగా తాను రూ.కోటికి పైగా నష్టపోయానన్నారు. మొలచింతలపల్లి, ముక్కిడిగుండం స్థానంలో ఎంపీటీసీగా పోటీ చేసేందుకు అభ్యర్థులు ఎవరూ ముందుకు రాకుంటే కాంట్రాక్టు పనులు చేసుకుంటున్న నన్ను పోటీ లో నిలబెట్టి, డబ్బులు ఖర్చు చేయించారన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ హన్మంతునాయక్, మేకల నాగరాజు, నాయకులు ఉన్నారు.

అనుమానాస్పదంగా విద్యార్థి మృతి

కోస్గి: వ్యవసాయ పొలం వద్ద ప్రమాదవశాత్తు షాక్ తగిలి యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బిజ్జారం చెందిన అప్పగారి అనంతయ్య కుమారుడు శివ కుమార్(21) డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం రాత్రి ఇంట్లో చెప్పకుండానే వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. బోరు మోటర్ స్టార్టర్ వద్ద విద్యుత్ సరఫరా వైరు తగలడంతో షాక్‌తో పొలంలోనే మృతి చెందాడు. ఉదయం వ్యవసాయ పొలానికి వెళ్లిన కొందరు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతి చెందిన కుమారుడిని చూసి కుటుంబ సభ్యులు బోరున విలపించారు. కాగా తమ కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదు చేయగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోక్సో కేసులో యువకుడు రిమాండ్

గద్వాల క్రైం: బాలికను కిడ్నాప్ చేసి లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడిని గురువారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ టాటాబాబు తెలిపారు. 12వ తేదీన పట్టణానికి చెందిన బాలికను గద్వాల మండలం కొత్తపల్లికి చెందిన నవీన్ మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేశాడు. బాలిక తల్లిదండ్రులు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించారు. గురువారం ఉదయం పట్టణ శివారులో తనిఖీలు చేపట్టిన క్రమంలో యువకుడిని పట్టుకున్నారు. అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టాగా బాలికను కిడ్నాప్ చేసినట్లు నేరం ఒప్పుకున్నాడని సీఐ తెలిపారు. నిందితుడు మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుడన్నారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించమన్నారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి గద్వాల కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

31 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



మరికల్: కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని టాస్క్ ఫోర్స్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. మండల కేంద్రానికి చెందిన కిష్టప్ప చుట్టుపక్కల గ్రామాల్లో సేకరించిన 31 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పూసల్‌పహాడ్ నుంచి రాకొండ మీదుగా గూడ్స్ వాహనంలో తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఆర్ఐ కాళప్ప తెలిపారు. వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మురళీ తెలిపారు.

ఆత్మకూర్: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. గురువారం పట్టణంలోని వెంకటేశ్వరకాలనీలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన 56 క్వింటాళ్ల, 93 సంచుల రేషన్ బియ్యాన్ని బొలెరో వాహనంలో లోడ్ చేస్తుండగా సమాచారం అందిందన్నారు. పట్టణానికి చెందిన బాల్‌రాజు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసుకుని రాయచూరుకు తరలించేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడని తెలిపారు. విషయాన్ని జిల్లా సివిల్ సప్లయి అధికారులకు సమాచారం అందించామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఫిల్టర్ ఇసుక తయారీ కేంద్రాల కూల్చివేత

హన్వాడ: మండలంలోని కారంతండాలో కొంతకాలంగా అక్రమంగా ఫిల్టర్ ఇసుకను తయారు చేస్తున్నారు. పలు గ్రామాలతో బాటు కారంతండాలో గురువారం తహసీల్దార్ కిష్టానాయక్, ఎస్‌ఐ వెంకటేష్ ఇసుక ఫిల్టర్‌లపై జేసీబీతో దాడులు చేసి కూలిచ్చేశారు. సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చే సినట్లు వారు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, D.Ed (TTC), B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM 3 నెలల్లో కోర్స్ పూర్తిచేసే అవకాశం. ఫోన్: 8888877112,339.

SERVICES

BUSINESS OFFER
■ మీ బంగారం తాకట్టులో ఉందా. వడ్డీ చెల్లించలేకపోతున్నారా. ఎటువంటి ఫైనాన్స్‌లో ఉన్నా బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకే కొనబడును. ఫోన్: 9389214214.
■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రొజెక్టును అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేకోవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఐర్పులు, ✆ 9773917835.

WANTED
■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 9030675274.

సాక్షి ద్వారా మీ ఆత్మీయులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయండి కేవలం రూ.500/- మాత్రమే
HAPPY BIRTHDAY

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు ... - సాక్షి మేనేజర్